అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రజలు అందించే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 28 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 32 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 13, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 2, ఉపా సెల్ విభాగానికి 2, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందరామిరెడ్డి, ఎంటెహెచ్(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

త్వరలో స్మార్ట్ స్ట్రీట్ బజార్లు ఏర్పాటు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో త్వరలో డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో స్మార్ట్ స్ట్రీట్ బజార్లు ఏర్పాటు చేయనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కాకాని రోడ్ వై జంక్షన్ నుంచి ఆటోనగర్ వరకు స్మార్ట్ బజార్ ఏర్పాటుకు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలసి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారి ఉత్పత్తుల విక్రయానికి స్మార్ట్ స్ట్రీట్ బజార్లు ఏర్పాటు చేయడానికి నిర్ణయించిందని చెప్పారు. అందులో భాగంగా గుంటూరు నగరంలో కూడా పలు ప్రాంతాలను పరిశీలించి, అనుకూలమైన ప్రాంతాల్లో స్మార్ట్ బజార్ల ఏర్పాటుకు ఫైనల్ చేస్తామని వివరించారు. స్మార్ట్ స్ట్రీట్ బజార్లలో మెప్మా ద్వారా శిక్షణ పొందిన డ్వాక్రా మహిళలకు షాపులు కేటాయిస్తామని పేర్కొన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందరామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ హనీఫ్ పాల్గొన్నారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమణ చేసుకొని, ట్రాఫిక్ సమస్య, మురుగుపారుదలకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణదారులు ఈ నెల 15వ తేదీ నాటికి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాల వలన డ్రెయిన్లు పొంగి మురుగు రోడ్ల మీదకు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజల నివాసాల్లోకి వెళ్లడం వలన పలు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఆగస్టు 15 తర్వాత పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగిస్తారని, అందులో జరిగే నష్టానికి ఆక్రమణదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

14న నగరంలో పొడవైన జాతీయ జెండా ప్రదర్శన


మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర పక్కన కమిషనర్ పులి శ్రీనివాసులు, షేక్ సజీల

నెహ్రూనగర్: కుల, మతాలకు అతీతంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న 9 అడుగుల వెడల్పుతో 10 కిలోమీటర్ల పొడవైన జాతీయ జెండా రికార్డ్ ప్రదర్శిస్తున్నామని ఇందులో నగర ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా 10 కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన గుంటూరు నగరంలో జరగనుందని.. ఇటువంటి ప్రతిష్టాత్మకమైన దేశ భక్తియుత కార్యక్రమంలో నగర ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 16 వరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగోలి, వ్యాస రచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా జిల్లా స్థాయి కార్యక్రమంగా ఈ నెల 14 మధ్యాహ్నం 3 గంటలకు 10 కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన చేపడుతున్నామన్నారు. గతంలో 9 కిలోమీటర్ల జెండా ప్రదర్శన రికార్డ్‌గా ఉందని, గుంటూరు నగరపాలక సంస్థలో 10 కిలోమీటర్ల ప్రదర్శన ద్వారా నూతన రికార్డ్ స్థాపన జరుగుతుందన్నారు. జెండా ప్రదర్శనకు 3 మార్గాలు గుర్తించి, జిల్లా పోలీసు అధికారులకు అందించామని, ట్రాఫిక్, ఇతర అంశాల మేరకు వారు ఫైనల్ చేసిన మార్గంలో ప్రదర్శన ఉంటుందని వివరించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, బి.స్మితపద్మజ, డి.లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

శంకరంబాడి సుందరాచారికి ఘన నివాళి


శంకరంబాడి సుందరాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: మా తెలుగు తల్లికి మల్లెపూ దండ పాటతో తెలుగు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచి పోయిన శంకరంబాడి సుందరాచారి రచనలను పాఠకులకు అందుబాటులో తేవల్సిన అవసరం ఎంతైనా ఉందని రచయిత్రి, ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్ పింగళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం మనమూ పాడుదాం రండి బృంద సభ్యుల ఆధ్వర్యంలో శంకరంబాడి సుందరాచారి జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 1975లో హైదరాబాద్‌లో జరిగిన ప్రప్రథమ తెలుగు మహా సభలలో తెలుగు తల్లికి మల్లె పూ దండ పాటను రాష్ట్ర గీతంగా ఎంపిక చేసి అధికార కార్యక్రమాలలో సభకు ముందు ఈ గీతాన్ని ఆలాపించాలని ప్రభుత్వం ఆదేశించిందని గుర్తు చేశారు. న్యాయవాది అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తన చరనా వ్యాసంగం, సాహితీ సేవను సుందరాచారి విడనాడలేదన్నారు. అనంతరం సంస్థ సభ్యులు నివాళులర్పించారు.

క్లుప్తంగా

ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలు అందజేత



కొరిటిపాడు: యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం క్రెడిట్ ఎక్స్‌పో నిర్వహించారు. బ్యాంకు రీజినల్ హెడ్ ఎస్ఎస్ జవహర్ కార్యక్రమాన్ని ప్రారంభించి, అర్హులైన ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా సకాలంలో సరళమైన వడ్డీ రేట్లతో గృహ, విద్యా రుణాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. స్వదేశీ, విదేశీ విద్యా రుణాల మంజూరులో ముందంజలో ఉంటుందని తెలిపారు. అర్హులైన వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు డెప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థ నాయక్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ జి.వి.రామాంజనేయ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన యువతకు సన్మానం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో రిఫరెన్స్ పుస్తకాలను చదువుకుని ఇటీవల ప్రకటించిన పోలీసు కానిస్టేబుల్, ఆర్ఆర్‌బీ టెక్నికల్ ఉద్యోగాలు సాధించిన యువతకు సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి వెన్నెటి సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రాంతీయ గ్రంథాలయంలో చదువుకున్న వారిలో తొమ్మిది మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఆరుగురు అభ్యర్థులను సత్కరించారు.

15న ఉచిత మెడికల్ క్యాంపు

గుంటూరు మెడికల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని శ్రీ శివ మెడికల్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆగస్టు 15న ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని మెడికల్ ఏజెన్సీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏజెన్సీ అధినేత బి.శివకృష్ణ తెలిపారు. వైద్య పరీక్షలపై రాయితీ ఇస్తున్నామని, మందులపై 22 శాతం రాయితీ ఇస్తామని వెల్లడించారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చేవారికి లక్కీ డ్రా తీసి ఎంపికైన ఐదుగురికి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఐరా హార్ట్ అండ్ పాలిక్లినిక్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ ఎం.ఎ.సమీనా ఫర్హీన్ తెలిపారు. స్థానిక ఆనందపేటలో హాస్పిటల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు. అవసరమైన వారికి గుండె పరీక్షలు కూడా చేస్తామన్నారు. పోలీసులు, మిలటరీ సిబ్బందికి ప్రతిరోజూ ఉచిత ఓపీ సేవలందిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ అతీఫ్ కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

లక్ష్మీపురం: ఓ వ్యక్తి అదృశ్యం ఘటనపై సోమవారం రాత్రి నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసరావు పేట 3వ లైన్‌కు చెందిన చెందాలు శివజగన్ మోహన్‌రావు నెయ్యి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య లక్ష్మీ సౌమ్య వీరువురికి ఇద్దరు సంతానం ఉన్నారు. గత 9 నెలల నుంచి శివజగన్ మోహన్‌రావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి నిద్ర పోతున్న సమయంలో కాల కృత్యాలకు అంటూ నిద్ర లేచి బయటకు వెళ్లిన వ్యక్తి ఇంటికి రాలేదు. సోమవారం రాత్రి నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అబద్ధం, మోసం కేరాఫ్ చంద్రబాబు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు


స్కానర్‌లను ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: అబద్ధం, మోసం చంద్రబాబుకు పుట్టుకతో వచ్చిన లక్షణమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గంలోని 23వ డివిజన్‌లో సోమవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ పచ్చి మోసానికి నిలువెత్తు రూపం ఉందంటే అది చంద్రబాబు అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ విస్మరించి రాష్ట్రంలో నీచ పాలనకు నాంది పలికారని మండిపడ్డారు. సిగ్గు, ఎగ్గులేకుండా తానేదో సంవత్సరంలో వెలబెట్టానని చెప్పుకోవడం హాస్యాస్పందంగా ఉందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే రానున్న రోజుల్లో బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రజలను నిలువునా వంచించిన మోసగాడు చంద్రబాబు అని మండి పడ్డారు. మహిళలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుకు దక్కుతోందని పేర్కొన్నారు. ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పార్టీ డివిజన్ నాయకుడు యాపర్తి కోటి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు డాక్టర్ ముత్యం, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, సూరసాని వెంకటరెడ్డి, సంజయ్, ప్రసాద్, బాజీ, ఆఫీజ్, హమీద్, కార్పొరేటర్ రోషన్ పాల్గొన్నారు.

న్యాయరంగంలో ఉపాధి అవకాశాలపై అవగాహన

నెహ్రూనగర్: న్యాయరంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని వాటిని అందిపుచ్చుకుని ముందుకు సాగాలని ప్రముఖ క్రిమినల్ చట్టాల నిపుణులు డాక్టర్ గంట సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని జేకేసీ కాలేజీ రోడ్డులోని ధర్మపీఠం సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయ రంగంలో ఉన్న విస్తృత ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సతీష్ కుమార్ మాట్లాడుతూ ఒక్క న్యాయవాది వృత్తిలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా 60కి పైబడి ఉన్నటువంటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెబీ, ఇన్సూరెన్స్ వంటి రెగ్యులేటరీ బాడీలలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇవన్నీ కూడా ప్రతి నిపుణునికి లక్షల్లో జీతాలు చెల్లిస్తున్నాయని వివరించారు. అనంతరం ధర్మపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వృత్తి, ఉద్యోగాలపరంగా వందలాది చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మపీఠం ఉపాధ్యక్షురాలు తాళ్లూరి ప్రహర్షిత, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి శ్రీనివాసరావు, శెట్టిపల్లి శశికిరణ్, సంపతి సంతోష్ కుమార్, కొంగర దినకర్, చామర్తి సంతోష్ కుమార్, పిట్టల వెంకట్రావు, పుల్లారావు పాల్గొన్నారు.

కూర్మావతారం- మానవతా విలువలపై ప్రవచనం


ప్రవచనం చేస్తున్న అప్పలాచార్యులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణ వేదికపై సోమవారం కూర్మావతారం- మానవతా విలువలపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆలయ పాలకమండలి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోగంటి వేంకట అప్పలాచార్యులు మాట్లాడుతూ కూర్మావతారం విష్ణువు రెండవ అవతారంగా మానవతా విలువలకు ప్రతీక అన్నారు. ఇది ఓపిక, బలం, త్యాగం వంటి లక్షణాలను సూచిస్తుందన్నారు. కూర్మం (తాబేలు) రూపంలో, విష్ణువు మందర పర్వతాన్ని మోస్తూ, పాలసముద్రాన్ని మథించడానికి దేవదానవులకు సహాయం చేశాడన్నారు. ఈ అవతారం ద్వారా, విష్ణువు సంక్షోభ సమయంలో ఓర్పుతో, బలంతో నిలబడటం, ఇతరులకు సహాయం చేయాలనే విలువలను తెలియజేస్తాడని భక్తవత్ భక్తులకు సవివరంగా తెలియజేశారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: యువతి వివాహాన్ని చెడగొట్టిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. వెంగళరావునగర్‌కు చెందిన శిఖా రమేష్ పెద్ద కుమార్తెకు కొన్ని నెలల క్రితం గుంటూరు అడవితక్కెళ్లపాడు ప్రాంతానికి చెందిన తాటిగిరి యశ్వంత్‌కుమార్‌తో వివాహం నిశ్చితార్థం చేసుకున్నారు. ఇద్దరి మధ్య వివాహం కాకుండానే మనస్పర్థలు రావడంతో వివాహం రద్దు చేసుకున్నారు. అయితే రమేష్ కుమార్తె ఫొటోలు అందరికి పంపిస్తానని యశ్వంత్‌కుమార్, అతని కుటుంబ సభ్యులు బెదిరింపులకు దిగడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం రమేష్ కుమార్తెకు మరొక వ్యక్తితో సంబంధం నిశ్చయం అయింది.

వివాహం జరిగేందుకు అన్ని సిద్ధం చేస్తున్న క్రమంలో వివాహానికి ఒక రోజు ముందు పెళ్లి కొడుకు జోసఫ్‌కు గతంలో తనతో నిశ్చితార్థం అయిందని యశ్వంత్ ఫొటోలు పంపించడంతో జోసఫ్‌తో వివాహం ఆగిపోయింది. దీంతో రమేష్ అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు యశ్వంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ తాకట్టులో ఉన్న ప్లాట్‌కు అగ్రిమెంట్ చేసి రూ.12 లక్షలు టోకరా

లక్ష్మీపురం: బ్యాంక్ తాకట్టులో ఉన్న ప్లాట్‌కు అగ్రిమెంట్ రాయించి రూ.12 లక్షలు తీసుకుని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై సోమవారం రాత్రి కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేటకు చెందిన అమర్‌నాథ్ అనే వ్యక్తి స్నేహితుడు ఖలీల్ అనే వ్యక్తి ద్వారా నరసరావుపేటకు చెందిన జెజరవాడ రజని, కాంతాచారి అనే వారు ఓ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్ అమ్మకానికి ఉందని మాయ మాటలు చెప్పి నమ్మ బలికారు.

ఆ ప్లాట్ ముందుగానే బ్యాంక్‌లో తాకట్టులో ఉన్న విషయం చెప్పకుండానే రూ.12 లక్షలు తీసుకుని అగ్రిమెంట్ రాయించి రిజిస్ట్రేషన్‌కు రావడం లేదు. ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు రాకుండా కాలయాపన చేస్తుండటంతో అనుమానం కలిగి అమర్‌నాథ్ విచారించగా బ్యాంక్ తాకట్టులో ప్లాట్ ఉన్నట్లు తెలిసింది. డబ్బులు తిరిగి వాపసు ఇవ్వాల్సిందిగా కోరడంతో రజని, కాంతాచారి కుటుంబ సభ్యులు ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితుడు అమర్‌నాథ్ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగ జీవితంలో విజయసాధన


మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవడం ద్వారానే ఉద్యోగ జీవితంలో విజయాన్ని సాధించగలరని ప్రముఖ ప్రేరణాత్మక ఉపన్యాసకుడు శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కనిష్ట స్థాయిలో అవసరమైన నైపుణ్యాలను ప్రేరణాత్మకంగానే కాకుండా వ్యవహారికంగా వివరించారు. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, విశ్లేషణాత్మక దృష్టికోణం, రీజనింగ్, సమస్య పరిష్కారం, నాయకత్వం, బృందపని, వృత్తిపరమైన నైతికత, తెలివైన నిర్వహణ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లో విజయ సాధనకు నైపుణ్యాలతో నిరంతరం సాధన చేస్తే భవిష్యత్తులో కెరీర్ నిర్మాణానికి మూల స్తంభాలని పేర్కొన్నారు. కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత మాట్లాడుతూ విద్యారంగంలో నాణ్యతను పెంచేందుకు కార్యకలాపాలైన స్ఫూర్తి పారిశ్రామిక ప్రదర్శన, విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు స్పర్ధ మేనేజ్‌మెంట్ ఫెస్ట్, సృజనాత్మక నైపుణ్యాలను పెంచేందుకు ఉద్దేశించిన సృజన గురించి వివరించారు. నాలుగురోజుల పాటు నిర్వహించనున్న ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో కొత్తగా ప్రవేశించిన విద్యార్థులకు కోర్సు లక్ష్యం, మౌలిక సిద్ధాంతాలు, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ ఎంబీఏ అనేది ఒక ప్రతిష్టాత్మకమైన డిగ్రీ అని, ఇది విజయవంతమైన కెరీర్‌కు మార్గం చూపిస్తుందని పేర్కొన్నారు. పట్టుదల, సమయపాలన, నిరంతర అభ్యాసం, తరగతులకు సక్రమంగా హాజరు కావడం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు షేక్ షబానా పర్వీన్, వేదవతి, అనిత, రాజేశ్వరి, వెంకట కళ్యాణ్ పాల్గొన్నారు.

రామాయణంలో స్త్రీ పాత్ర ఉదాత్తమైనది


మాట్లాడుతున్న శ్రీరంగనాయకి

నగరంపాలెం: రామాయణంలో స్త్రీ పాత్రలు చాలా ఉదాత్తంగా చిత్రీకరించబడ్డాయని డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి అన్నారు. ఏటీ అగ్రహారం శ్రీకంచి కామకోటి పీఠ శంకర, గాయత్రీ, దత్త సాయి, సత్యదేవ మందిరం (గాయత్రీ మాతా మందిరం)లో సంస్కృత భారతీ ఆధ్వర్యంలో సంస్కృత సప్తాహం సోమవారం నిర్వహించారు. సంస్కృతి భారతి మహిళ ప్రముఖ్ డాక్టర్ జొన్నాభట్ల ఉమ అధ్యక్షత వహించారు. రామాయణం- స్త్రీ పాత్రలో ఉదాతత్త అనే అంశంపై కోగంటి వేంకటశ్రీరంగనాయకి మాట్లాడుతూ కౌశల్య, సుమిత్ర, సీత, ఊర్మిళ, తార, మండోధరి పాత్రలను వాల్మీకి ఉదాత్తంగా మలిచారన్నారు. సుమిత్ర సీతారాముల వెంట తన కుమారుడైన లక్ష్మణుని పంపుతూ సీతను తల్లిగా, రాముడిని తండ్రి అయోధ్య భావించమని చెప్పిందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గంగవరపు బలరామకృష్ణ శర్మ, స్త్రీ పత్రి వేణుగోపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ.54 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శంకుస్థాపన చేశారు. సోమవారం 34వ డివిజన్ కోబాల్ట్‌పేట 3వ లైన్‌లో సీసీ డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు కుల, మత, పార్టీలకతీతంగా ప్రాధాన్య క్రమంలో చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ల అభిప్రాయాల మేరకు, వారు ప్రతిపాదించిన ప్రాంతాలలో ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బూసీ రాజలత, ఈరంటి వరప్రసాద్ పాల్గొన్నారు.

'ప్రకృతి' కరివేపాకు ఆరోగ్యానికి మేలు

జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.రాజకుమారి

చేబ్రోలు: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిన పంటలు రసాయన రహితంగా ఉండటం వల్ల ఆరోగ్యానికి కలిగే మేలు కలుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.రాజకుమారి అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో కరివేపాకు సాగు చేసిన పి.నాగభూషణం పొలంను సోమవారం డీపీఎం రాజకుమారి పరిశీలించారు. వేజండ్ల గ్రామానికి చెందిన రైతు సాగు చేస్తున్న కరివేపాకుకు ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తుండటం వల్ల ఇటువంటి కరివేపాకు కు మార్కెట్లో సాధారణ ధర కంటే 10% అధిక ధర లభించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ సహకారంతో ''అన్యధా'' అనే ప్రైవేట్ కంపెనీతో అధికారికంగా ఒప్పందం కుదిరిందన్నారు.కార్యక్రమంలో డీపీఎం కె.రాజకుమారితో పాటు అన్యధా కంపెనీ ప్రతినిధి సాయికేష్, ఎస్ఎఫ్ఏ సుమ పాల్గొన్నారు.

•చెస్ పోటీలో పొన్నూరు విద్యార్థికి ద్వితీయ స్థానం

పొన్నూరు: పట్టణంలోని ఆర్‌కే ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి షేక్ అయాన్ అహ్మద్ గుంటూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు అండర్ 8 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌కె. నజీర్ ఖాన్, చెస్ కోచ్ బాజీ బాషా విద్యార్థినిని అభినందించారు.

నగరంలో వర్షం కష్టాలు


మూడు వంతెనల నుంచి శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్డులో భారీ ట్రాఫిక్


వర్షంలో ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు


ప్రభుత్వ బాలికల కళాశాల వద్ద వర్షం నీరు, నీళ్లలోనే దాటుతున్న బాలికలు



నగరంలో భారీ వర్షం పడింది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా దంచికొట్టింది. రోడ్లు జలమయం అయ్యాయి. మురుగు కాలువలు పొంగాయి. ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. శంకర్ విలాస్ ఓవర్‌బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. నగరంలో ట్రాఫిక్ మళ్లించారు. దీని ప్రభావంతో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు